నాడు కళకళ.. నేడు వెలవెల

- శిథిలావస్థలో వివేకానంద కల్యాణ మండపం
- మరమ్మతులకు నోచుకోని వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మండపం
- పూర్వ వైభవం తేవాలని స్థానికుల విజ్ఞప్తి


కల్యాణ మండపం లోపల చెత్తాచెదారం, మద్యం బాటిళ్లు


మండపం ఆవరణలో పేరుకుపోయిన చెత్త


శిథిలావస్థకు చేరిన నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం

సీతమ్మధార: అది ఒక కల్యాణ మండపం. అక్కడ వివాహాలు, ఎటువంటి శుభకార్యాలు జరగడం లేదు. అదేంటి ఆషాఢ మాసం కదా.. అందుకే పెళ్లిల్లు జరగడం లేదనుకుంటే పొరపాటే. ఆ మండపం శిథిలావస్థకు చేరడమే ఇందుకు కారణం. జీవీఎంసీ జోన్-3 అధికారుల పుణ్యమా అని ఇటు మరమ్మతులు.. అటు టెండర్లు పిలవకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. దీంతో జీవీఎంసీ ఆదాయానికి గండి పడుతోంది.

పట్టించుకోని అధికారులు

జోన్-3 పరిధి 24వ వార్డు నక్కవానిపాలెంలోని జీవీఎంసీ వివేకానంద కల్యాణ మండపం సభలు, సమావేశాలు, వివాహాలతో నాడు కళకళలాడేది. ఇదంతా గతం అన్న మాదిరిగా నేడు వెలవెలబోతోంది. గతేడాది కల్యాణ మండపం కాంట్రాక్ట్ కాల పరిమితి ముగియడంతో జోన్-3 రెవెన్యూ విభాగం అధికారులు కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరమ్మతులు చేస్తామని చెప్పి.. నేటికీ పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. అప్పటి నుంచి ఇక్కడ శుభకార్యాలు జరగని పరిస్థితి నెలకొంది.

1990లో ప్రారంభం

నాటి మేయర్ డి.వి.సుబ్బారావు హయాంలో నిర్మించిన ఈ కల్యాణ మండపాన్ని 1990లో అప్పటి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి డి.కె.సమరసింహారెడ్డి ప్రారంభించారు. టెండర్లు పిలవడం ద్వారా కాంట్రాక్టర్లు ఈ కల్యాణ మండపాన్ని నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ కాలపరిమితి ముగియడం, జీవీఎంసీ స్వాధీనం చేసుకుని నెలలు గడుస్తున్నా.. మరమ్మత్తులు మాత్రం ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజల ఆవేదన

మండపం చుట్టుపక్కల సీతమ్మధార, గాంధీనగర్, నక్కవానిపాలెం, టీపీటీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల ప్రజలు తమ శుభకార్యాలు, సభలు, సమావేశాల కోసం ఈ కల్యాణ మండపాన్ని ఆశ్రయిస్తుంటారు. పలు రాజకీయ సమావేశాలు కూడా ఇక్కడ జరుగుతుంటాయి. ప్రస్తుతం ఆఫ్ శారీ ఫంక్షన్లు చేద్దామంటే ఈ మండపం అందుబాటులో లేక దూరంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయనందునే కల్యాణ మండపం కొంతవరకు శిథిలావస్థకు చేరుకుందని అంటున్నారు.


పాడైన మండపం గేటు

జోరుగా అసాంఘిక కార్యకలాపాలు

కొంతకాలంగా వినియోగంలో లేని ఈ కల్యాణ మండపం వద్ద కనీసం సెక్యూరిటీ గార్డు లేడు. మండపానికి తాళం వేసే నాథుడు కానరాడు. ఫలితంగా చుట్టుపక్కల గల ఆకతాయి యువకులు ఇక్కడ చేరి జూదం, మద్యపానంతో మండపాన్ని మరుగుదొడ్లుగా మార్చేశారు. మండపంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కల్యాణ మండపం ఆవరణ, లోపల భాగమంతా చెత్తాచెదారం, మద్యం బాటిళ్లతో చిందరవందరగా ఉందంటే నిర్వహణ తీరు ఎంత ఘోరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కల్యాణ మండపానికి ఇప్పటివరకు జోన్-3 అధికారులు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన మండపానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని లేదా దాని స్థానంలో కొత్త మండపం నిర్మించాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

మండపానికి మరమ్మతులు చేయాలి



నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి ప్రారంభించాలి. గతంలో ఈ మండపంలో ఎన్నో కల్యాణాలు జరిగాయి. పాడైన తరువాత ఎవరూ పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– నక్క గణేష్, నక్కవానిపాలెం

పూర్వ వైభవం తీసుకురావాలి



వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి పూర్వ వైభవాన్ని తీసుకురావాలి. అన్ని వర్గాల వారు తక్కువ ధరకు ఈ మండపంలో కల్యాణాలు చేసుకుంటారు. మండపం పాడవడంతో నిరుపయోగంగా ఉంది. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి.

– గుజ్జు లోకేష్‌రెడ్డి, నక్కవానిపాలెం

మొక్కలు నాటిన విద్యార్థుల తల్లులు


కప్పరాడ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థుల తల్లులు

కంచరపాలెం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం 54వ వార్డు ఐటీఐ జంక్షన్ కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని విజయమాలి నేతృత్వంలో విద్యార్థుల తల్లుల చేత మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు.

అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2024లో ఉత్తీర్ణత లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఆ రోజు ఉదయం 10 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు సీట్ల ఖాళీల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్‌ను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్(టీసీ), 4 నుంచి 10 తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఈడబ్ల్యూఎస్ అర్హత ఉన్నవారు సంబంధించి ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్‌లు జిరాక్స్ కాపీలను తీసుకువాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల రోజున రిజిస్ట్రేషన్ ఫీజు, కళాశాల ఫీజుతో కలిపి సుమారు రూ.5,500 సీటు పొందిన వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో స్వల్ప ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ


గైస్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు గైస్ పూర్వ విద్యార్థులు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 1971–1975 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. కాలేజీలో చదువుతున్న నాలుగు బ్రాంచీల్లో టాపర్లకు ప్రామాణిక పాఠ్యపుస్తకాలు అందజేశారు. కెమికల్ ఇంజినీరింగ్ నుంచి కె.దేష్ను, జి.ధనుంజయ్, పెట్రోకెమికల్స్ నుంచి బి.రాజ్యశ్రీ, పి.మనోజ్, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ నుంచి ఇ.స్రవంతి, ఎం.రేవంత్, ఆయిల్ టెక్నాలజీ నుంచి కె.సాయిప్రణతి, ఎస్.మోహన్ పుస్తకాలు అందుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నుంచి వి.రామచంద్రరావు, వి.నాగభూషణం, పి.కనకసాయి, జె.శంకరరావు, డీవీవీ సత్యనారాయణ, ఎం.ఎస్.ఎన్.రాజు, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా హరికథ


పురందరదాసు జీవిత గాథను వినిపిస్తున్న నారాయణ ఆచార్యులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హరికథ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో పురందరదాసు జీవత చరిత్రను శ్రావ్యానందకరంగా నెల్లూరుకు చెందిన భాగవతార్ శ్రీ నారాయణ ఆచార్యులు వినిపించారు. కార్యక్రమాన్ని గాత్ర విద్వాంసురాలు పంతుల రమ, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పురందరదాసు జీవత గాథ ఎంతో రమ్యంగా గీతాలపన ద్వారా వినిపించి అలరించారు. అనంతరం ప్రేక్షకులకు ప్రసాదం అందజేశారు.

5 నుంచి శ్రావణమాస పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి పూజలు జరపనున్నారు. నెల రోజులూ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తారు. భక్తులకు దేవస్థానమే పూజా సామగ్రి సమకూర్చనుంది.

క్రైం పోలీసులకు రివార్డులు, ప్రశంసాపత్రాలు


సీపీ శంఖబ్రత బాగ్చీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: పలు కేసులను ఛేదించిన ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు శనివారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్ గ్రీన్ పార్క్ కాలనీలో నివసిస్తున్న రిటైర్డ్ సీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఎర్రాజీ ఈ నెల 5న హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లారు. తాళం వేసిన ఉన్న ఆయన ఇంట్లో కిటికీ ఇనుప గజాలు తొలగించి చోరీకి పాల్పడిన ఘటనలో క్రైం ఎస్ఐ కె.భాస్కరరావుతో పాటు హెచ్‌సీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు జగదీష్, దిలీప్, ప్రసాద్ చాకచక్యంగా పోర్టు స్టేడియం ఎదురుగా గల పెట్రోల్ బంక్ వద్ద నిందితుడు షేక్ రఫీని పట్టుకున్నారు. బీరువాలో దొంగిలించిన 14 తులాల బంగారు నగలు, 400 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వేస్టేషన్ వద్ద మరో నిందితుడి కోసం గాలిస్తున్న సమయంలో ఇద్దరు అనుమానాస్పదంగా ఉండటంతో వారి బ్యాగులు తనిఖీ చేయగా.. గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరిని, గంజాయి బ్యాగులను ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ విజయకుమార్‌కు అప్పగించారు. ఈ కేసుల్లో చాకచక్యంగా వ్యవహరించిన క్రైం ఎస్ఐ కె.భాస్కరరావుతోపాటు హెచ్‌సీ సత్యనారాయణ, కానిస్టేబుళ్ల ఉమేష్, ప్రవీణ్, దిలీప్, జగదీష్, ప్రసాద్‌లకు రివార్డులతోపాటు ప్రశంసాపత్రాలను సీపీ అందజేశారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 160వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోజు సాయంత్రం స్లీవ్ గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలు వీధుల్లో తిరుగుతుందని 15న ప్రధాన మహోత్సవం నిర్వహిస్తామన్నారు. పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి. వినయ్‌కుమార్, పి.ఆంథోనీ, పీపీసీ అధ్యక్షుడు శ్రీముసిరి రాజేష్, కార్యదర్శి పి. ఫ్రాన్సిస్, జాయింట్ సెక్రటరీ జి. ఆనందరావు, జాయింట్ కోశాధికారి నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

47వ వార్డులో జెడ్సీ పర్యటన


రాంజీ ఎస్టేట్‌లో గెడ్డను పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ, అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్, కప్పరాడ, అంబేద్కర్ ఎస్టేట్ ప్రాంతాల్లో శనివారం జోన్-5 కమిషనర్ ఆర్.జీ.వి.కృష్ణ అధికారులతో కలిసి పర్యటించారు. కొండవాలు ప్రాంతాల్లో పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి జెడ్సీ సూచించారు. పారిశుధ్యంపై శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని స్థానికులు ఫిర్యాదులు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటరీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఆదేశించారు. పర్యటనలో ఇంజినీరింగ్ డీఈ భరణికుమార్, సతీష్, కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతతో మెరుగైన నైపుణ్యం

అల్లిపురం : విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవడం ద్వారా టెలికాం రంగంలో రాణించవచ్చని బీఎస్ఎన్ఎల్ పీజీఎం (ఆపరేషన్స్) పి.పాల్ విలియం తెలిపారు. అమలాపురంలోని బొన్నా వెంకట చలమయ్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌తో విశాఖలోని బీఎస్ఎన్ఎల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. రాజమండ్రిలోని బీవీసీఈసీ ప్రాంగణంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి అందించేందుకు, వారిని వ్యవస్థాపకులుగా మార్చేందుకు తగిన శిక్షణ ఇచ్చేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుంది. బీఎస్ఎన్ఎల్ డీసీఎం ఆపరేషన్స్ కె.జగదీశ్వరరావు, డీజీఎం బి. శ్రీనివాసరావు, డీసీఎం సీఎం ప్రాజెక్ట్స్ ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, అధికారులు ఎస్‌వీబీ శ్రీదేవి, బీఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థుల బృందాన్ని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సీతంపేట: ప్రపంచవ్యాప్తంగా వ్యాపార, పారిశ్రామిక రూపకల్పన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'ఓపెన్ గ్రూప్' అనే అంతర్జాతీయ సంస్థ 7 అంశాల్లో పోటీ నిర్వహించింది. దీనిలో లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని మండపాక కామాక్షి పద్మ వృతిక సారథ్యం వహించిన బృందం పాల్గొంది. మెంటార్లు రాజశేఖర్ వాసా, అనిల్ షైంగాంకర్ ఈ బృందానికి మార్గదర్శనం చేశారు. నీతి ఆయోగ్ ప్రారంభించిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో పాల్గొనేందుకు పాఠశాల స్థాయి విద్యార్థులకు మార్గదర్శనం చేసేందుకు బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, శ్రీశారదా విద్యాలయం ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం విద్యార్థుల బృందాన్ని కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి అభినందించారు.

సముద్ర చైతన్యంపై విద్యార్థులకు అవగాహన


కేంద్రీయ విద్యాలయం-1 విద్యార్థులతో నేవల్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు

కంచరపాలెం: భారతీయ నావికాదళంలో 'సముద్ర చైతన్యం–జీవితంతో పరిచయం' అనే అంశాలపై కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం-1 విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహించిన అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. కేంద్రీయ విద్యాలయం-1కు చెందిన విద్యార్థులు మెటీరియల్ ఆర్గనైజేషన్‌ను సందర్శించారు. సుమారు 100 మంది విద్యార్థులకు అగ్నిమాపక ప్రదర్శన, డిపో పనితీరు గురించి నేవీ అధికారులు అవగాహన కల్పించారు.మానవ రహిత రోబోట్‌లతో కూడిన కసరత్తులు, స్టోర్‌ల నిర్వహణ కోసం ఆటోమేటిక్ స్టోరేజ్, రిట్రీవల్ సిస్టమ్‌ను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించినట్టు విద్యాలయ అధ్యాపకులు తెలియజేశారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

కేవీ–1లో 'శిక్షా సప్తాహ్'

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ దరి విజయనగర్‌కాలనీలోని కేంద్రీయ విద్యాలయం -1లో శిక్షా సప్తాహ్'లో భాగంగా శనివారం తల్లి విద్యార్థి పేరున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కిషోర్ నేతృత్వంలో తల్లి విద్యార్థి చేత మొక్కలు నాటించారు. కిషోర్ మాట్లాడుతూ మాతృమూర్తికి గౌరవం ఇస్తూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మదీనా మాలిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక


లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థుల సందడి

సీతంపేట: వారంతా లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థులు... 1974 నుంచి 1977 వరకు బీకాం చదివి వెళ్లిపోయినవారు మళ్లీ ఇప్పుడు కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాల గురించి ఆరా తీసుకున్నారు. అప్పటి మధురస్మృతులను నెమరవేసుకుని పరవశించిపోయారు.ఈ అపూర్వఘట్టానికి నగరంలోని ఓ హోటల్ వేదికైంది. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కళాశాల స్థాపించిన తర్వాత రెండో బ్యాచ్‌లో సుమారు 52 మంది విద్యార్థుల్లో 38 మంది శనివారం కలుసుకున్నారు. వీరిలో చాలా మంది డాక్టర్లు, లాయర్లు, వ్యాపారవేత్తలు, ఇంజినీర్లుగా, బ్యాంకు మేనేజర్లగా స్థిరపడ్డారు.కొందరు పదవీ విరమణ చేశారు. పూర్వ విద్యార్థుల కలయికకు కృషి చేసిన రామారావు, హనుమంతరావు, రాంబాబు, చందు, ఎంవీ సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, రమ, ఉమ, చలపతి, రామమూర్తిలను సహచరులు అభినందించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


ఉపాధ్యాయులతో డీఈవో చంద్రకళ

పెందుర్తి: ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. బాల్యాన్ని గౌరవించాలని..పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- 36 గ్రాముల బంగారం స్వాధీనం
- క్రైం డీసీపీ వెంకటరత్నం వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వెంకటరత్నం తదితరులు

ఎంవీపీకాలనీ: కొంత కాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడ్ని ఎంవీపీ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటనపై నగర క్రైం డీసీపీ ఎ.వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు, ఎంవీపీ క్రైమ్ సీఐ సీహెచ్ శ్రీనివాసరావులు శనివారం రాత్రి ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద జాలరిపేట, గాంధీ సెంటర్ సమీపంలోని గెంబలి శారద ఇంట్లో ఈ నెల 22 రాత్రి దొంగతనం జరిగింది. పెద్ద ఎత్తున బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు ఆదేశాలతో ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్ఐ జగదీష్ ఇతర సిబ్బంది ప్రత్యేక టీమ్‌గా ఏర్పాడి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితుడి కోసం గాలించారు. అదే ప్రాంతానికి చెందిన గుర్రపు శివ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో అతనిపై నిఘా పెట్టి శనివారం చాకచక్యంగా పేదవాల్తేర్ ఆర్టీసీ డిపో సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించాడు. 36.76 గ్రాముల బంగారం, 2,604 గ్రాముల వెండితో పాటు రూ.31,200 స్వాధీనం చేసుకున్నారు. అయితే గుర్రపు శివపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతను చెడు వ్యసనాలకు బానిసై వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో అతని నుంచి మరిన్ని వివరాలు రాబడుతున్నారు. కేసు ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జగదీష్‌ల బృందానికి క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఏ.వెంకటరావు అభినందనలు తెలిపారు.